క్లుప్తంగా

విధుల్లో ఎస్డీఆర్ఎఫ్ బృందం



గోదావరి వద్ద విధుల్లో అధికారులు, సిబ్బంది

ఖానాపూర్: వినాయక నిమజ్జనం నేపథ్యంలో శనివారం పట్టణంలోని గోదావరి వద్ద రాష్ట్ర విపత్తుల స్పందన దళం(ఎస్డీఆర్ఎఫ్)తోపాటు అగ్నిమాపక సేవల శాఖ అధికారులు, సిబ్బంది విధులు నిర్వర్తించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రతిమలు నిమజ్జనం చేసే ప్రాంతంలో అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా విధుల్లో ఉన్నట్లు వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్వో జావెద్ అలీ, ఫైర్‌మెన్లు వెంకటేశ్, నరేశ్, మనోజ్, సాయిచరణ్ ఉన్నారు.

మొరం ట్రాక్టర్ పట్టివేత

ఖానాపూర్: మండలంలోని మస్కాపూర్‌లో అక్రమంగా మొరం తరలిస్తున్న ట్రాక్టర్‌ను శనివారం పట్టుకున్నట్లు తహసీల్దార్ సుజాత తెలిపారు. ట్రాక్టర్‌ను తహసీల్దార్ కార్యాలయానికి తరలించి జరిమానా విధించినట్లు పేర్కొన్నారు. అనుమతుల్లేకుండా మొరం రవాణా చేస్తే తమ దృష్టికి తీసుకురావాలని ప్రజలకు సూచించారు.

ఆలయం మూసివేత

సారంగపూర్: చంద్రగ్రహణం సందర్భంగా ఆదివారం మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సోమవారం ఉదయం 6 గంటల వరకు మండలంలోని అడెల్లిలో మహాపోచమ్మ ఆలయం మూసివేస్తున్నామని ఆలయ ప్రధాన అర్చకుడు శ్రీనివాస శర్మ ఓ ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు మాత్రమే భక్తులను ఆలయంలోకి అనుమతిస్తామని పేర్కొన్నారు. భక్తులు గమనించాలని సూచించారు.

పంట నష్టంపై సర్వే



మున్యాల్‌లో సర్వే చేస్తున్న ఏఈఓ తిరుపతి

దస్తురాబాద్: భారీవర్షాలకు పంటలు దెబ్బతిన్నందున శనివారం మండలంలోని మున్యాల, దేవునిగూడెం గ్రామాల్లో ఏఈవో తిరుపతి సర్వే నిర్వహించారు. ఈసందర్భంగా నష్టపోయిన రైతుల వివరాలు నమోదు చేసుకున్నారు. సర్వే చేసి పంట నష్టం వివరా లతో కూడిన నివేదికను ఉన్నతాధికారులకు పంపుతామని ఏఈవో పేర్కొన్నారు.

సన్మానం




రాజేశ్వర్‌ను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

కుభీర్: మండలకేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా పని చేసి రిటైరైన సంగి రాజేశ్వర్–సంధ్యారాణి దంపతులను శనివారం పాఠశాలలో సన్మానించారు. హెచ్ఎం గంగాధర్, ఉపాధ్యాయులు గంగారాం, సురేశ్, విజయ్‌కుమార్, హరిహరనాథ్, సాయన్న, పార్థసారథి, వాణి, సంధ్యారాణి, హంసలత, బాపురావ్, సరిత, పద్మ, నవీన్‌కుమార్ తదితరులు ఉన్నారు.

మహిళలకు అవగాహన

కుంటాల: మండలంలోని దౌనెల్లి, దౌనెల్లి తండాల్లో శనివారం మహిళలకు భద్రతా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వంటగ్యాస్ సిలిండర్ వినియోగంపై కుంటాల రాజరాజేశ్వర ఏజెన్సీ సిబ్బంది అవగాహన కల్పించారు. అత్యవసర వేళ 1906 నంబర్‌కు కాల్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో మేనేజర్ జక్కుల గజేందర్, సిబ్బంది కృష్ణ, నవీన్, మహిళలు పాల్గొన్నారు.

సంప్రదాయాలను కాపాడాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు

ఖానాపూర్: పాశ్చాత్య సంస్కృతి వీడి మన సంప్రదాయాలను కాపాడేలా ఉత్సవాలు నిర్వహించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. శనివారం పట్టణంలోని జగన్నాథ్‌రావు చౌరస్తాలో హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణేశ్ ఉత్సవ స్వాగతోత్సవానికి హాజరై మాట్లాడారు. డీజేలకు బదులు డోలు, మంగళవాయిద్యాలను ఉపయోగించుకోవాలన్నారు. సకాలంలో బస్టాండ్‌కు శోభాయాత్రగా చేరిన ఒకటో నంబర్ శ్రీరాంనగర్ మండప నిర్వాహకులను అభినందించారు. అనంతరం పూజలు చేసి యువకులతో ఎమ్మెల్యే నృత్యాలు చేశారు. హిందూ ఉత్సవ సమితి అధ్యక్షుడు మంత్రరాజ్యం సురేశ్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను సన్మానించారు.

గణపయ్యా.. వెళ్లి రావయ్యా



కుభీర్‌లో భజన చేస్తున్న భక్తులు



సోన్: న్యూవెల్మల్‌లో పాల్గొన్న యూత్ సభ్యులు



లోకేశ్వరం: అబ్దుల్లాపూర్‌లో మోక్ష గణపతి వద్ద..



ముథోల్: బోరిగాంలో నిమజ్జనోత్సవంలో ఎస్సై బిట్ల పెర్సిస్, భక్తులు

లక్ష్మణచాంద/సోన్/కుభీర్/కుంటాల/ముథోల్/దస్తురాబాద్/లోకేశ్వరం/ఖానాపూర్: జిల్లాలోని పలు ప్రాంతాల్లో శనివారం నిర్వహించిన గణేశుడి నిమజ్జనం శోభాయమానంగా సాగింది. మండపాల వద్ద ప్రత్యేక పూజలు, అన్నదానం చేశారు. ఈసందర్భంగా డప్పుచప్పుళ్ల నడుమ సాగిన శోభాయాత్రలో యువకులు నృత్యాలు చేస్తూ సందడిగా గడిపారు. అనంతరం సమీపంలోని చెరువులు, కుంటల్లో మట్టి ప్రతిమలను నిమజ్జనం చేశారు. అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు, విద్యుత్ శాఖ అధికారులు చర్యలు చేపట్టారు. కుభీర్‌లో యాదవసంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాథుడి వద్ద బజార్‌హత్నూర్ మండలం నుంచి వచ్చిన కళాకారుల బృందం కోలలు వేశారు. వరసిద్ధి కర్ర గణపతి ముందు మరాఠీ సంప్రదాయంలో భజనలు చేశారు. ఆర్యవైశ్యుల గణేశుడి మందు మహిళలు, యువకులు నృత్యాలు చేశారు.లోకేశ్వరం మండలంలోని అబ్దుల్లాపూర్, రాయపూర్‌కాండ్లీ, ధర్మోర, పిప్రి, లోకేశ్వరం, గొడిసెరా గ్రామాల్లో నిమజ్జనం చేశారు. ఖానాపూర్‌లో హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో జగన్నాథ్‌రావు చౌరస్తాలో వినాయకుడి శోభాయాత్రకు ఘనస్వాగతం పలికారు.



లక్ష్మణచాందలో..



దస్తురాబాద్‌లో ప్రతిమ వద్ద భక్తులు



కుభీర్‌లో వరసిద్ధి కర్ర గణేశుడి ఎదుట విఠలేశ్వరస్వామి ఆలయ కమిటీ సభ్యులు



కుంటాలలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

ధర్మోరలో లడ్డూకు రూ.43 వేలు



ధర్మోరలో లడ్డూతో భూమన్న

లోకేశ్వరం: మండలంలోని ధర్మోర గ్రామంలో శనివారం మండపం వద్ద వినాయకుడి లడ్డూకు వేలంపాట నిర్వహించారు. గ్రామానికి చెందిన గీజా భూమన్న రూ.43 వేలకు దక్కించుకున్నారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ మామిడి నారాయణ్‌రెడ్డి, వీడీసీలు కథం అనిల్‌పటేల్, బండారి భూమన్న, గీజా భూమన్న, కొండ శ్రీనివాస్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

మహిళపై కేసు నమోదు

నిర్మల్‌టౌన్: గణేశుడి నిమజ్జన వేడుకలో మద్యం మత్తులో బురఖా ధరించి హల్చల్ చేసిన నిజామాబాద్‌కు చెందిన నసీం బేగం అనే యువతిపై పట్టణ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. ఈ విషయానికి సంబంధించి ఎవరైనా వదంతులు వ్యాప్తి చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు.

ఘనంగా గురుపూజోత్సవం



తానూరు కేజీబీవీలో ఉపాధ్యాయులుగా మారిన విద్యార్థినులు

తానూరు: మండలకేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో శనివారం ఉపాధ్యాయుల దినోత్సవం నిర్వహించారు. విద్యార్థినులు ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. ఈసందర్భంగా సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులకు బహుమతులు అందించారు. ప్రిన్సిపాల్ అలేఖ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

లక్ష్మణచాంద: మండలకేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా తమకు విద్యాబుద్ధులు నేర్పుతున్న గురువులను సత్కరించారు. ఇందులో హెచ్ఎం రాజునాయక్, ఉపాధ్యాయులు హరిప్రసాద్, అశోక్, వినోద్‌బాబు పాల్గొన్నారు.

కుంటాల: మండలకేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో విద్యార్థులు తమకు విద్యాబుద్ధులు నేర్పుతున్న గురువులను సన్మానించారు. అనంతరం సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి నివాళులర్పించారు. ప్రిన్సిపాల్ ఎత్రాజ్ రాజు తదితరులు పాల్గొన్నారు.



లక్ష్మణచాందలో సన్మానం పొందిన ఉపాధ్యాయులు



కుంటాల : సన్మానం పొందిన ఉపాధ్యాయులు

లోకేశ్వరం: మండలంలోని రాజూర గ్రామ ప్రాథమిక పాఠశాలలో రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులకు ఆటలపోటీలు పోటీలను నిర్వహించి బహుమతులు అందజేశారు.

ముథోల్: మండలకేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో, ఎంఈవో కార్యాలయంలో సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి నివాళులర్పించారు. హెచ్ఎంలను శాలువాతో సన్మానించారు.

సోన్: మండలకేంద్రంలోని కేజీబీవీలో ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ శిరీష, పీఈటీ ప్రియాంక తదితరులు ఉన్నారు.



లోకేశ్వరం: రాజూర ప్రాథమిక పాఠశాలలో నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు



సోన్ కేజీబీవీలో..



ముథోల్‌లోని బాలికల ఉన్నత పాఠశాలలో..

బాధితులకు పరిహారం అందిస్తాం

బాసర: భారీవర్షాలకు పంటలు నష్టపోయిన రైతులు అధైర్యపడొద్దని.. పరిహారం అందించి ఆదుకుంటామని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి నారాయణరావు పటేల్ పేర్కొన్నారు. శనివారం బాసర మండలంలోని ఓని గ్రామంలో వర్షాలకు దెబ్బతిన్న రోడ్లు, పంటలను పరిశీలించారు. సమస్యను మంత్రుల దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు మమ్మాయి రమేశ్, బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శంకర్ చంద్రే, ముత్యం రెడ్డి, బ్లాక్ సేవాదళ్ మండలాధ్యక్షుడు భుజంగ్‌రావు పాటిల్, జంగం రమేశ్, సాయిరెడ్డి, దేవేందర్, సాయినాథ్, ముథోల్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు గంగారెడ్డి, జంగం శశిధర్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.



పంట పరిశీలిస్తున్న నారాయణరావు

ఓటరు జాబితా ప్రదర్శన



తానూరు : జాబితా చూపుతున్న అధికారులు

తానూరు: ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాలకు నిర్వహించే ఎన్నికల ఓటరు జాబితాను శనివారం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో మండల ప్రత్యేకాధికారి శ్రీనివాస్, ఎంపీడీవో నసీరొద్దీన్ ప్రదర్శించారు. అన్ని పంచాయతీ కార్యాలయాల్లో ఓటరు జాబితా ప్రదర్శిస్తున్నామని.. జాబితాలో ఏవైనా తప్పులు ఉంటే ఈనెల 9లోగా అధికారుల దృష్టికి తీసుకురావాలని ఆయన సూచించారు. సిబ్బంది తదితరులు ఉన్నారు.



ఖానాపూర్ : జాబితా ప్రదర్శిస్తున్న ఎంపీడీవో

ఖానాపూర్: ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని పట్టణంలోని మండల ప్రజాపరిషత్ కార్యాలయం వద్ద శనివారం నూతన ఓటరు, పోలింగ్ కేంద్రాల జాబితా ప్రదర్శించారు. ఈసందర్భంగా ఎంపీడీవో రత్నాకర్‌రావు మాట్లాడారు. జాబితాలో అభ్యంతరాలుంటే గడువులోగా అధికారులను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ నర్సింహస్వామి తదితరులున్నారు.

ఆలయానికి నిధులివ్వాలి

లక్ష్మణచాంద: మండలంలోని రాచాపూర్‌లో పురాతన హనుమాన్ ఆలయ పునఃనిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరుతూ గ్రామస్తులు ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డికి వినతిపత్రం అందించారు. శనివారం జిల్లాకేంద్రంలోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి ఆలయ నిర్మాణానికి నిధులు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు చిన్నయ్య, నాయకులు అద్వాల పద్మ రమేశ్, మాజీ ఎంపీటీసీ బన్నబోయిన పోశెట్టి, వేణుగౌడ్, పూసల లక్ష్మణ్, భూసి పెంటాజి, భూసి సురేశ్ తదితరులు ఉన్నారు.



ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న నేతలు

ముథోల్ ఎమ్మెల్యే పరామర్శ



సూర్యాపూర్‌లో పరామర్శిస్తున్న ఎమ్మెల్యే

కుంటాల: మండలంలోని సూర్యాపూర్ గ్రామానికి చెందిన బక్కి ప్రభాకర్ తల్లి చంద్రబాయి, పెంచికల్‌పాడ్ గ్రామానికి చెందిన మారుతి పటేల్ భార్య యశోదబాయి ఇటీవల వివిధ కారణాలతో మృతి చెందారు. శనివారం ఎమ్మెల్యే రామారావు పటేల్ వారి ఇళ్లకు వెళ్లి బాధిత కుటుంబాలను పరామర్శించారు. రమణారావు, వెంగల్‌రావు, శేఖర్‌రావు తదితరులు ఉన్నారు. బీఆర్ఎస్ మండల కన్వీనర్ పడకంటి దత్తాద్రి సూర్యాపూర్‌లో చంద్రబాయి కుటుంబసభ్యులను పరామర్శించారు.

నాయకుల పరామర్శ

లోకేశ్వరం: మండలంలోని ధర్మోర గ్రామానికి చెందిన మాఅమ్మ–నాన్న ఫౌండేషన్ చైర్మన్ మాదిరి ఆంజనేయులు తల్లి మృతిచెందగా బాధిత కుటుంబాన్ని శనివారం మాజీ జెడ్పీటీసీ లక్ష్మీపురం నారాయణ్‌రెడ్డి పరామర్శించారు. మామిడి నారాయణ్‌రెడ్డి, చిన్నారావు, మాజీ సర్పంచ్ శ్రీధర్ ఉన్నారు.

సారంగపూర్: మండలకేంద్రానికి చెందిన కళాకారుడు టేకులపల్లి భోజన్న తండ్రి పెద్దన్న అనారోగ్యంతో మృతిచెందాడు. బాధిత కుటుంబాన్ని బేడ, బుడగజంగం రాష్ట్ర 57 కులాల ఉపాధ్యక్షుడు గంధం గంగాధర్, మాజీ ఎంపీపీ మహిపాల్‌రెడ్డి పరామర్శించారు. బీఆర్ఎస్ మండల కన్వీనర్ మాధవరావు, రేషన్ డీలర్ల సంఘం మండల అధ్యక్షు డు నారాయణరెడ్డి, రాజు, శంకర్, లక్ష్మణ్ ఉన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం



నిర్మల్‌రూరల్: సన్మానం పొందిన ఉపాధ్యాయులు

తానూరు: మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో శనివారం మండలస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారికి ఎంఈవో నరేందర్ ప్రశంసాపత్రం, మెమెంటో అందజేశారు. ఎస్టీయూటీఎస్ జిల్లా అధ్యక్షుడు భూమన్నయాదవ్ ,మల్లన్న, ఆయా పాఠశాలాల ఉపాధ్యాయులు ఉన్నారు.

పదోన్నతి పొందిన గణిత ఉపాధ్యాయులకు..

నిర్మల్‌రూరల్: జిల్లాలో ఇటీవల పదోన్నతి పొందిన గణిత ఉపాధ్యాయులను శనివారం జిల్లా గణిత ఫోరం ఆధ్వర్యంలో నిర్మల్‌లోని ఈద్‌గాం ఉన్నత పాఠశాలలో సన్మానించారు. స్కూల్ అసిస్టెంట్ నుంచి పీజీహెచ్ఎంలుగా, ఎస్జీటీల నుంచి స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతి పొందిన 8 మంది గణిత ఉపాధ్యాయులను శాలువా, పూలమాలలతో సన్మానించారు. ఫోరం జిల్లా అధ్యక్షుడు సీహెచ్.శ్రీనివాస్, ఉపాధ్యాయులు పెంట అశోక్, నాగుల రవి, గజ్జారం, పురుషోత్తం, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకు ఉద్యోగులకు..

కడెం: మండలకేంద్రంలోని తెలంగాణ గ్రామీణ బ్యాంక్‌లో పని చేసే ఫీల్డ్ ఆఫీసర్ ప్రమోద్, క్యాషియర్ కుమార్ బదిలీపై వెళ్తుండగా శనివారం బ్యాంకులో అధికారులు వారిని సన్మానించారు. మేనేజర్ నరేశ్, సిబ్బంది తదితరులున్నారు.

దివ్యాంగులకు వైకల్య నిర్ధారణ శిబిరం

భైంసాటౌన్: పట్టణంలోని భవిత విలీన విద్యాకేంద్రంలో అలింకో, సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో శనివారం దివ్యాంగులైన విద్యార్థులకు వైకల్య నిర్ధారణ శిబిరం నిర్వహించారు. భైంసా డివిజన్ పరిధిలోని ఆయా మండలాల నుంచి 135 మంది దివ్యాంగులైన విద్యార్థులు హాజరవగా వైద్యులు నిర్ధారణ పరీక్షలు జరిపారు. ఈ సందర్భంగా విలీన విద్యా జిల్లా సమన్వయకర్త ఎస్. ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో ఏటా 18 ఏళ్లలోపు దివ్యాంగులైన విద్యార్థులకు నిర్ధారణ పరీక్షలు నిర్వహించి అవసరమైనవారికి అలింకో సంస్థ ద్వారా ఉపకరణాలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంఈవో సుభాష్, విలీన విద్యా రిసోర్స్ ఉపాధ్యాయులు, ప్రత్యేక ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం త్వరగా పూర్తి చేయాలి

- డీపీవో శ్రీనివాస్

కుంటాల: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని డీపీవో శ్రీనివాస్ అధికారులకు సూచించారు. మండలంలోని దౌనెల్లి గ్రామంలో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను శనివారం పరిశీలించారు. దశలవారీగా బిల్లులను లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో మంజూరు చేస్తామని పేర్కొన్నారు. అనంతరం అందకూర్ గ్రామపంచాయతీ కార్యాలయంలో రికార్డులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన వెంట డీఎల్పీవో సుదర్శన్, ఎంపీవో రహీంఖాన్, పంచాయతీ కార్యదర్శులు సాయేందర్, రమ్య, హౌసింగ్ ఏఈ శ్రీనివాస్ కత్రాజి తదితరులు ఉన్నారు.



దౌనెల్లిలో ఇంటి నిర్మాణాన్ని పరిశీలిస్తున్న డీపీవో శ్రీనివాస్

'ఉపాధి' పనులకు వెళ్లాలి



మన్మద్‌లో మాట్లాడుతున్న ఎంపీడీవో సోలమాన్

లోకేశ్వరం: జాబ్‌కార్డుదారులు ఉపాధి పనులకు వెళ్లాలని ఎంపీడీవో సోలమాన్‌రాజ్ అన్నారు. శనివారం మండలంలోని మన్మద్, బిలోలి, పంచగుడి, వట్టోలి, జోహర్‌పూర్ గ్రామాల్లో ఉపాధిహామీ సామాజిక తనిఖీ గ్రామసభలు నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ కూలీలు పనిప్రదేశంలో మాస్టర్‌రోల్‌లో సంతకాలు చేయాలని పేర్కొన్నారు. డీఆర్పీ నరేశ్, శ్రీలత, టీఏ శారద, ఎఫ్ఏలు భోజన్న, పోశెట్టి, రాజన్న, అంజన్ రెడ్డి తదితరులున్నారు.

క్షీరాభిషేకం

కడెం: లంబాడాలను ఎస్టీ జాబితా నుంచి తొలగిస్తూ కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలకు నివేదిక పంపాలని సుప్రీంకోర్టును ఆశ్రయించిన మాజీ ఎంపీ సోయం బాపురావు, తెల్లం వెంకట్రావ్ చిత్రపటాలకు శనివారం కడెంలో భీం విగ్రహం వద్ద రాజ్‌గోండ్ సేవా సమితి నాయకులు క్షీరాభిషేకం చేశారు. ఇందులో సేవాసమితి జిల్లా అధ్యక్షుడు ఆత్రం రాజేశ్వర్, భీంరావు, అంకుశ్‌రావు, వెడ్మ పరశురాం, భీంరావు, మధు, బాలాజీ ఉన్నారు.

వైకుంఠరథం అందజేత



దాతలను సన్మానిస్తున్న వీడీసీ సభ్యులు

కుంటాల: మండలంలోని లింబా(కె) గ్రామంలో ఏనుగు భాజారెడ్డి, బుస్సాపూర్ జలపతిరెడ్డి అనే ఇద్దరు ఉపాధ్యాయులు శనివారం రూ.2 లక్షల 50 వేల విలువైన వైకుంఠరథాన్ని గ్రామస్తులకు అందజేశారు. తమ తల్లిదండ్రులు ఏనుగు చిన్నారెడ్డి–నర్సవ్వ, బుస్సాపూర్ చిన్నారెడ్డి–అమ్మాయి జ్ఞాపకార్థం అందించినట్లు దాతలు తెలిపారు. ఈసందర్భంగా దాతలను గ్రామస్తులు సన్మానించారు. కార్యక్రమంలో వీడీసీ చైర్మన్ ముత్యంరెడ్డి, మాజీ సర్పంచ్‌లు సవ్వి అశోక్‌రెడ్డి, ఆనంద్‌రావు పటేల్, డైరెక్టర్లు గోనె గజ్జారాం, మహేందర్, గ్రామస్తులు పాల్గొన్నారు.